# దేవుడు దయామయుడు

సోమరాజుకి కాల్ లెటరు వచ్చింది.

రేపే ఇంటర్వ్యూ.

ఇన్నాళ్ళకి ఒక ఇంటర్వ్యూ.

ఇన్నాళ్ళకో, ఎన్నాళ్ళకో.... ఇంటర్వ్యూ వచ్చిందంటే అది దేవుని దయవల్లే – అని సోమరాజు ఉద్దేశం!

సోమరాజు :

సోమరాజు ఇంటికి పెద్ద కొడుకు. తండ్రి తప్పించి తల్లిలేనివాడు. ఒక అక్క, ఇద్దరు చెల్లెళ్ళు గలవాడు. ఇరవై ఆరేళ్ళ వాడు. ఫర్వాలేదు. అందగాడు. పితృభక్తి, గురుభక్తి గలవాడు. అన్ని భక్తులను మించిన దైవభక్తి గలవాడు.

విద్యా పాసయ్యి అయిదారేళ్ళుగా ఎందుకు పనికిరాకుండా ఇంట్లో వున్నాడు. ఇన్నాళ్ళూ ఇంట్లో వుండడం రోగం వచ్చికాదు. జిడ్డితనం, గుడ్డితనం వల్లకాదు–కేవలం ఉద్యోగం దొరక్క.

తను చదివింది కాలక్షేపానికీ, సరదాకీ, అల్లరి చేయడానికీ, లెక్చరర్లను తన్నడానికీ కాకుండా – తప్పక ఉద్యోగం వస్తుందనే హోప్‌తోనే చదివేడు. మంచి వుద్యోగం దేవుడు తప్పక ఇప్పిస్తాడనే ఆశతోనే చదివేడు.

సోమరాజుకి దేవుడిమీద మంచి నమ్మకం. 'దేవుడా! స్కూల్

పైసలు పాస్ చేయించు' అని రోజూ స్కూలు కెళ్ళేముందు దేవుడికి దండం పెట్టేవాడు; దాంతో మొదటి ఛాన్సులోనే పాసయి కూర్చున్నాడు. 'దేవదేవ ! కాలేజీలో సీటు వచ్చేటట్టు చేయి' అని అమిత భక్తితో చేతులు జోడించగా - సీటువచ్చి కూర్చుంది. ఏడుకొండలవాడా, ఆపద మొక్కులవాడా ! ఫీజు సర్దుబాటుచేయి. లేకుంటే పరీక్షల్లో కూర్చోనివ్వ రంటే - అప్పు దొరికింది ! ఫీజుకట్టి పరీక్ష కెళ్ళేడు. అంతేకాదు - 'ఇవే ఆఖరి పరీక్షలు గట్టెక్కించు' అని ప్రార్థిస్తే గట్టెక్కించేరాడు దేవుడు !

ఆ తర్వాత 'దేవుడా ! ఉద్యోగం ఇప్పించు, నా ఉంగరాల జుట్టుని ఇచ్చేస్తాను అని మొక్కుకున్నాడు. కుప్పలు కుప్పలు కొలది వచ్చేస్తున్న జుట్టుని ఏమి చేసుకోవాలో, ఎక్కడ పెట్టాలో తెలీని తికమకలో కాబోలు దేవుడు సోమరాజు మాట అయిదారేళ్ళదాక వినలేక పోయాడు. అయినా సోమరాజు భక్తి ఏమాత్రం చెదరలేదు. అమావాస్య చీకటిలో ముగ్గిపోతున్న కలవపూవు పౌర్ణమి చంద్రుని కోసం ఎదురు చూసే టట్టుగా - దేవుని దయకోసం ఎదురు చూసేడు.

ఆ విధంగా ఎదురు చూస్తుండగా—

'వత్సా ! నీ భక్తికి మెచ్చితిని. ఇక నీ కోరిక సిద్ధించుగాక' అన్న ట్టుగా కాల్ లెటర్ వచ్చింది.

అదెలాగంటే -

'అరె ! నాకిన్నాళ్ళు చెప్పలేదేం. నాకు తెల్సినతను ఎంప్లాయ్ మెంట్ ఎక్స్ఛేంజ్‌లో వున్నాడు. వందరూపాయలిస్తే కాల్ లెటర్ పంపిస్తా అన్నాడు రాంబాబు. సోమరాజు దూరపుచుట్టం రాంబాబు.

రాంబాబు నోటితో ఈ మధుర వాక్కు ఆ భగవంతుడే పలికేడని నమ్మేడు, సోమరాజు. అంచేత ఆ భగవంతుడే ఆ వందరూపాయలను చూపగలడనే ధైర్యం వచ్చేసింది.

సోమరాజు తండ్రి అప్పుడెప్పుడో చిన్నతనంలో ఆడిన బంతాటకి బేష్‌బేష్‌మని మెచ్చి ఒక బడా జమీందారు ఇచ్చిన బంగారు పతకం అమ్మితే సరిగ్గా వందరూపాయలొచ్చేయి. నిజంగా అది దైవ మహిమ

ఏమంటే ఆ బంగారు పతకం అందుకోసమే వున్నాననట్టు - ఇన్నాళ్ళూ భద్రంగా కట్టిపెట్టి అడుగున వుండిపోయింది. లేకుంటే తల్లి మందులకో, ఇంటి ఖర్చులకో, కొంత అద్దెకో ఖర్చయిపోయి వుండేది కదా!

ఆ వంద రూపాయల్ని సోమరాజు రాంబాబు కిచ్చేడు.

ఆ వంద రూపాయల్ని రాంబాబు జగన్నాధని కిచ్చేడు.

జగన్నాథం :

జగన్నాథం ఎంప్లాయిమెంటు ఎక్ఛేంజ్‌లో హెడ్ గుమస్తా.

అతని జీతం చాలీచాలనిది. అతని తలమీద వెంట్రుకలు పండీ పండనివి. అతని నోట్లో దంతాలు వూడీ వూడనివి. అతని ముఖంమీద గంట్లు కనీకనబడనివి. అతని అంతరాత్మ చచ్చీ చావనిది.

అంచేత అది అతన్ని అప్పుడప్పుడు వెర్రిమొర్రి ప్రశ్నలువేసి వేధించుకు తింటుంది.

అందుకు జగన్నాథం చెప్పుకొనే సమాధానం —

నేను చేస్తుంది తప్పంటారా? నేను చేస్తున్నది తప్పన్నందుకు మీ రెవరు? అవును, నేను చేస్తుంది తప్పేఅనిఒప్పేసుకోడానికి నేనెవర్ని? అంతా అందరిచేతా చేయిస్తున్నది ఆ జగన్నాధుడు. ఆ సర్వేశ్వరుడు. ఆ వైకుంఠవాసుడు. తప్పు ఒప్పులు నిర్ణయించాల్సింది నీవు, నేను కాదు నాయనా ఆ భగవంతుడు. ఏమంటే నీవు చెప్పే న్యాయం, ధర్మం నల్గురికీ న్యాయమైనదీ, ధర్మమైనదీ అని నీకు అనిపించవచ్చు. కాని ఎదుటి వాడికి అనిపించకపోవచ్చు. అవునా? అందుకేగదా ఈ లోకంలో ఇన్ని రకాల మనుషులూ, ఇన్ని పార్టీలు, ఇన్ని గ్రూపులూను! అంచేత ఏమిటన్నమాట - మనిషి న్యాయాన్యాయాలు, ధర్మాధర్మాలు నిర్ణయించ లేడు. ఒకవేళ మనిషే నిర్ణయించితే అతడు మనిషి కాదన్నమాట - దేవుడు?.... కాని మనిషి మనిషే అవుతాడు గాని దేవుడెలా అవుతాడు?

నా ముష్టి మూడొందలు జీతంతోనే నా ముగ్గురు కూతుళ్ళకి అడిగినంత కట్నం సమర్పించి యోగ్యులైన మొగుళ్ళను సంపాదించ గల్గేనంటారా? ఆ ముష్టి మూడొందలతోనే ఇదిగో ఈ ఇల్లు ఆరుగదులది (దాని మీద మరో మూడు గదులు లేపాలని ప్లాను కూడా వుందను

కోండి) కట్టేయగల్గేనంటారా? నా పుత్ర రత్నానికి ఆ జీతంతోనే మైసూరులో బి. ఇ. సీటు కొనగల్గేనంటారా?

నాచొక్కా చిరగకపోడానికీ, నా పొట్ట పెరగడానికీ, నా తల్లికి వచ్చిన క్షయవ్యాధి పోడానికీ, నా పిల్లా పాపా ఆయురారోగ్యాలతో బంగారు పూవుల్లా కళకళ్ళాడుతూ మెరిసిపోడానికి కారణం ఆ ముష్టిజీతమేనంటారా? కాదు, కాదు, ఆ ఏడుకొండలవాడి దయ. ఆ వెంకటేశ్వరుడి కటాక్షం. సర్వలోక పాలకుడైన ఆ సర్వేశ్వరుని దయా కటాక్షం! ఆ దయా కటాక్షాలే లేకపోతే, ఆ ముష్టి జీతమే గతైతే యీ పాటికి నా కూతుళ్ళు చచ్చిపోవడమో, లేచి పోవడమో జరిగేది. చీకటి ఇరుకు గదిలో అద్దెకి తగలడాల్సి వచ్చేది. నాకొడుకు ఏ లారీలోనో క్లీనర్‌గా చేయాల్సి వచ్చేది. ఈ పాటికి నాతల్లి చచ్చేసి వూర్కొనేది. నాచొక్కా చిరిగి, పొట్ట తరిగి పోయుండేది. నాపిల్లాపాప బంగారు పూవుల్లాకాకుండా కుష్కించిన శవాల్లా వుండడం జరిగేది. కాదంటారా?

నిజంగా నేను చేసేది తప్పయితే ఆ దేవుడు నన్నిలా పున్నిస్తాడా? మన్నిస్తాడా? ఇంత సౌభాగ్యంగా, ఇలా సంతోషంగా వుండగలనా? చూడండీ– నేనేదో మేలు చేస్తానని ఏదో కొంత మీరు మాకిస్తున్నారు. మీక్కావల్సింది మీకు యిచ్చి నాక్కావల్సింది నేను తీసుకుంటున్నాను. అది పొరపాటా? కాదు లంచమా? కానే కాదు– అది మీకు, నాకు భగవంతుడు చూపిన మార్గం. ఒక్కొక్కడికి నానా అవకాశంలేకో, లేక మనిషి సృష్టించిన న్యాయానికి, చట్టానికి జడిసో నిలబడలేక చస్తున్నాడు. ఆకలి చావు చస్తున్నాడు. కాని నిజానికి వాడు చచ్చేడు. అంటే వాడికి చావు రాసుందన్నమాట. అలాగే నేను పచ్చపచ్చగా బతకాలని ఆ దేవుడే రాసుంటాడన్నమాట. చూడండీ– మీకొకటి చెబుతాను. తల్లికి పదిమంది సంతానం వుంటారనుకోండి. ఆ తల్లి పదిమందినీ ఒకేలాగ ముద్దిస్తుందా? లేదు. ఒకరంటే యెక్కువ ముద్దు, మరొకరంటే తక్కువ ముద్దు వుంటుంది. కాదంటారా? కాదనలేరు. అలాగే నీవూ, నేనూ దేవుడి బిడ్డలైనప్పటికీ– దేవుడికి నాపై వున్న ముద్దు నీపై లేకపోవచ్చు కదా! అది మీ దురదృష్టం. మీ కర్మ ఫలం. దానికెవరూ ఏం చేయలేరు. అదే

విధంగా నా అదృష్టాన్ని యెవరూ ఆపలేరు- ఏడ్వడం తప్పించి.

అయినా దేవుడి కింకా పూర్తిగా, సంపూర్తిగా నాపై దయ కలగ లేదు. మేడ మీద మూడు గదులూ కట్టేసి, పూరవతల స్థలం కొనేస్తే.... ఆ దేవదేవుని సంపూర్ణ దయ సంప్రాప్తించినట్టే లెక్క! అది యీ ఏడాదిలోగా జరిగిపోతే.... తండ్రీ.... వెంకటేశా.... శేషాద్రివాసా.... ఏడుకొండలవాడా నీ దర్శనం చేసుకుంటాను. నా తల నీలాలు సమర్పించు కుంటాను స్వామీ.... అంతేకాకుండా నీ హుండీలో అర్థవెయ్యి నూట పదహారు వేస్తాను తండ్రీ అనుగ్రహించు- ఏడుకొండలవాడా, వెంకట రమణా గోవిందా గోవింద!

అయ్యా! అదీ సంగతి! అంతటి పథకం వేసుకున్న దేవుడి ముద్దుల బిడ్డ జగన్నాథం తలాకరి దగ్గర పంద, పంద పుచ్చుకుని .... సోమరాజు దగ్గర కూడా రాంబాబు ద్వారా పుచ్చుకొని మాట తప్పకుండా అందరికీ కాల్ లెటర్సు పంపించేడు.

అందరితోబాటు సోమరాజుకి కాల్ లెటరు వచ్చింది. ఆనందంతో కాల్ లెటరు పట్టుకొని రాంబాబు దగ్గరికి పరిగెత్తేడు.

రాంబాబు కాల్ లెటరు చూసి 'ఫర్లేదు- మంచి కంపెనీ. మంచి జీతం నాకు తెల్సినతను ఒకడున్నాడు. అతను ఉద్యోగం గ్యారంటీగా ఇప్పించ గలడు. పద అతన్ని కలుద్దాం' అన్నాడు.

ఇద్దరూ అతన్ని కలిసేరు.

అతని పేరు అప్పన్న!

అప్పన్న :

అప్పన్నని చూడగానే సోమరాజు ముఖం వెలవెల బోయింది. పులిని చూపిస్తానని చెప్పి లేసికెళ్ళి పిల్లిని చూపించినట్టనిపించింది, రాజ దర్శనం ఇప్పిస్తానని చెప్పి రౌతు దగ్గరికి తీసుకువెళ్ళి నట్టనిపించింది.

కత్తి మొహం, లూజు షరాయి, సారా నోరు, ఎర్రకళ్ళు, పెద్ద జుత్తు, నోట్లో బీడీ, మెళ్ళో తావీదు, ముఖంమీద గంట్లు.... వీడా నాకు ఉద్యోగం ఇప్పించేది! అనుకున్నాడు సోమరాజు.

రెండు జిడ్డు కుర్చీలమీద సోమరాజు, రాంబాబు కూర్చున్నారు.

అప్పన్న మంచంమీద కూర్చున్నాడు. అప్పుడే నిద్రలేచినట్టు న్నాడు.

అప్పన్న రాత్రులు తిరుగుతాడు. పగలు పడుకుంటాడు. మధ్యాహ్నం బాగా తాగి, భోంచేసి పడుకున్నాడు. కాని నిద్రపట్టలేదు. అతను ఒక పని చేద్దామనుకున్నప్పుడు అది నెరవేరేదాకా నిద్రపట్టదు. పట్టినా ఎంతోసేపు వుండదు.

తనకి ఎందుకు నిద్దురపట్టడం లేదంటే—

షిప్పులోంచి మాంచి ఒకటో నెంబరు టేప్ రికార్డర్ కమ్ ట్రాన్సిస్టర్ దిగింది. దొరతో తను బేరం ఏడు వందలకి ఆడేడు. కాని ఇంకా కొనలేదు. కొనడానికి డబ్బు పూర్తిగా చాల్లేదు. చేతిలో నాలుగు వందలున్నాయి. మరో మూడు వందలు కావాలి అదీ యీరోజే రాత్రి లోపుగా కావాలి. రేపు మళ్ళీ ఆ షిప్పు వెళ్ళిపోతుంది. రేపటిలోగా ఎలాగైనా కొనేయాలి. అది కొనేస్తే లక్కీ ఛాన్సు. దాన్ని పదిహేను అమ్మినా కళ్ళకద్దుకు మరి తీసుకుంటారు. కాని ఎలా? డబ్బుకి. ఎప్పుడూ ఇంత ఇబ్బంది రాలేదు. ఎలాగోలా డబ్బు చేతికి రావడం, వ్యాపారం సజావుగా సాగడం జరిగేది. కాని యీరోజు మాత్రం ఎంత ప్రయత్నించినా డబ్బు సమకూరలేదు. తంటాలు పడితే నాలుగు వందలు దొరికేయి. మరో మూడు వందలు ఎలా?

ఎలా అనుకుంటుండగా అప్పన్నను చూసి వెంకటేశ్వరుడు నవ్వేడు. నవ్వుతున్న వెంకటేశ్వరుడు అప్పన్న చేతిలో వున్నాడు. చేతివ్రేలుకి ఉంగరం రూపంలో వున్నాడు. ఉంగరంలో నున్న ఏడు కొండలవాణ్ణి చూడగానే అప్పన్నకి ఎక్కడలేని ధైర్యం వచ్చేసింది. డబ్బు దొరికి పోతుందన్న నమ్మకం ఏర్పడిపోయింది. 'సామీ! మిగతా నాలుగొందలూ దొరికే దారి చూపిస్తే— నాకొచ్చే లాభంలో ఓ యాభై రూపాయలు నీ డిబ్బీలోనేస్తా, ఒట్టు సామీ!' అని పైకే అన్నాడు.

సరిగ్గా ఆ సమయంలోనే దేవుడే పంపినట్టుగా రాంబాబు, సోమరాజు వచ్చేరు

వచ్చినవాళ్ళకి కుర్చీలు చూపించేడు అప్పన్న.

రాంబాబు వచ్చిన పని ఏవిఁటో చెప్పాడు.

'ఓస్, ఇంతేగదా, చిటికెలో పని' అన్నాడు అప్పన్న చాలా తేలిగ్గా।

గగనకుసుమం అనుకున్న ఉద్యోగాన్ని చిటికెలో పనిగా అప్పన్న తేల్చేస్తుంటే- సోమరాజు నోరావలింపేశాడు. సోమరాజుకి అప్పన్నమీద నమ్మకం కలగలేదు.

సోమరాజు అనుమానాన్ని అప్పన్న పసిగట్టి, తన గొప్పతనం చెప్పాలని నిర్ణయించుకొని ఇలా అన్నాడు—

'సూడు బాబూ.... నీ పేరేటీ.... సోవఁరాజా.... సోవఁరాజు బాబూ.... నాసంగతి మీకు తెల్దు. ఆ రాంబాబుకూడా అంతగా నాసంగతి ఎరికనుకోను.... బాబూ ఈ అప్పన్న పైకి ఎదవనాగ అవుపిస్తుండేమోగాని.... ఇదిగో బాబూ ఈ అప్పన్న అల్లాటప్పన్నకాదు. ఎర్రిసేనుగాడు. ఈడేటి? ఈడి అవతారవేఁటి? ఈడేం నాకుజ్జోగం ఏయిత్తాడనుకుంటున్నావు గదు బాబూ.... నీకు తెల్దుగాని నా ఉజ్జోగవేఁ అది. కులాం వోళ్ళకి ఉజ్జోగాలు ఏయించడవేఁ నా యుజ్జోగం. నావల్ల కొన్ని వందలమంది ఉజ్జోగస్తులయినారంటే నీవు నమ్మవు. తాగుబోతు ఎదవ ఈడేటి సేత్తాడనుకుంటున్నావుగాని బాబూ— ఇదిగో సూడూ.... ఆ సూరిబాబు పెదకొడుక్కి యుజ్జోగం ఏయించెందెవడు? ఈ అప్పన్న. వోత్తరక నెంబరు ప్రెసిడెంటు గున్నయ్య శెట్టి కొడుక్కి యుజ్జోగం ఏయించింది ఎవరోకాదు నానే! ఇంకా సాలా మందికి.... ఎందుకా పేర్లన్నీ బాగోదు. సోవఁరాజ్ బాబూ.... నీకు తెల్దుగాని నాకీ పట్నంలో తెలీని ఆఫీసరంటూ లేడు. నీకు ఇంటరువ్యూవున్న కంపెనీలో ఆఫీసరు బాబులేగాక- పెతీ ఆఫీసరు బాబుకీ బిడ్డికానించీ అమ్మాయిలదాక మనవేఁ సప్లయి సేయాల. ఈ ఊళ్ళో నాలాంటోళ్ళు లేకొల్దు. కాని నానంటేనే ఆ బాబుకి మంచి నమ్మిక. మనవిచ్చే సరుకంతా నికార్సయిన ఫారిను సరుకు. తెచ్చే ఆడోళ్ళంతా నేపాల్, బొంబాయి గుంటలు! కుర్రోడివి.... నీకివన్నీ సెప్పకూడదుగాని మాటొచ్చినాది గాబట్టి సెబుతున్నాను. నానెలాంటోణ్ణో, నా పలుకుబడేటో ఎరిక సేయడానికే సెబుతున్నాను.

ఇగో సోమ రాజ్ బాబూ! నాను మాటకీ, నీతికీ నిలబడ్డో
మాటిచ్చానంటే ఆ మాటకోసం పేణాలైనా ఇచ్చేత్తాను. నానేటో గొప
తనం సెప్పేసుకుంటుండు అనుకోపోతే ఒక మాట.... రేపు నీ
యుజ్జోగం వస్తే నీకు జీతం ఎంత? మూడొందలు, అంతేనా? కా
నాకు? అలా అంటున్నానని ఏటీ అనుకోకు! నాకు రాబడి కనీసం రోజుక
వంద! ఏటలా తెల్ల మొగం ఏస్తావు? ఆసికం కాదు.... తల్లి తోడు! కా
ఆ మాయదారి డబ్బు నిల్వదు. తల్లి మాలచ్మికి నా యింట్లో కూకోడ
వంటే కిట్టదు.

సోమరాజ్ బాబూ! నాను తినే తిండి, ఎళ్ళే ముండా, తా
తాగుడూ – పెద్ద పెద్దోళ్ళకూ కూడా వుండదు. అవుతే పెద్దోళ్ళకీ, నాక
తేడా ఏటంటే ఆళ్ళకి నాలా అయా సరదాలూ, అలవాట్లే కాకుండ
విలవ, మరియాదా. మేడా డాబూ, దర్జా వుంటాయి. నాకుండవు. అంతే తేడా
ఇంతకీ నాను సెప్పేదేటంటే ఏదీ నీవు యుజ్జోగం ఎయించమని ఆఫీస
బాబుకాడికి డబ్బెట్టుకెళ్ళు. ఎత్తే నాటకాలేస్తున్నావేటి నా కొడకా అ
కుక్కని తగిలేసినట్టు తగిలేత్తాడు. నేకపోతే ఫోన్ చేసి పోలీసోల్ల
అప్పగించేత్తడు! ఆ బాబు అలా సేయడం డబ్బంటే సేదైకాద
నానిచ్చినా అదే డబ్బు. నీవిచ్చినా అదే డబ్బు. కాని నాలాటి నమ్మ
మైన మనిషి ఎళ్ళి యిస్తేనే ఉచ్చుకుంటాడు" —

ఆ విధంగా తన గొప్పతనాన్ని అప్పన్న వివరించేడు.

"ఇంతకీ మీకు రేపు ఇంటర్వ్యూ సేయబోయే ఆఫీసరు ఎవర
ఎరికా! రవీంద్రబాబని పర్సనలాఫీసరు. మా గొప్పోడులే! డబ్బం
గొప్ప కక్కుర్తి! రూపాయకి అయిదు నొప్పున తీసుకుంటాడు. అన
మూడొందలు జీతవు గుమాస్తా యుజ్జోగానికి పదిహేను వొందలు తీ
కుంటాడు. అరదవయిందా?"

అర్థమయిపోయింది సోమరాజుకి.

"పదిహేనొందలే!" ఊపిరి పోతున్నట్టుగా అన్నాడు సోమరాజ

"డబ్బు తీసుకొచ్చేసినారా" అడిగేడు అప్పన్న.

"లేదు".

"లేకుంటే ఎట్టాగ! ఈ రేతిరికి రేతిరే అన్ని ఎరేంజిమెంట్లు సేసేసాం. అంసేత వేగ పట్టుకు వా(రెండి డబ్బు. మళ్ళా టయిం సాల్దు."

డబ్బురా డబ్బు! చిల్ల పెంకులు కాదు రాత్రి లోపుగా తెచ్చేయడానికి!

"అంత డబ్బు ఒక్కసారిగా యెలా సర్దుబాటు చేయగలం. పేదోళ్ళం. అందులోనూ ఈ ఒక్క రాత్రిలోగా తెచ్చేయమంటున్నారు."

"బాబూ, ఒక పైసా తగ్గించడానిగ్గాని, ఓ పైసా అప్పు పెట్టడానిగ్గాని రవీంద్రబాబు ఒప్పుకోడు. సీ పిచ్చిగాని సోమరాజు బాబూ! డబ్బు కావాలనుకుంటే ఎంత? టకేల్ మని. వన్ మినేట్ల వచ్చేద్ది! ఆ ఏడుకొండలోణ్ణి తల్సుకుంటే. అలా తల్సుకొని పెయత్నం సేయండీ. ఎందుకు రాదో సూస్తాను.... ఇంకా ఇక్కడే ఉన్నారేటి బేగెళ్ళి పా(రాక" — అని వాళ్ళను దౌడు తీయించేడు అప్పన్న.

"డబ్బు చూడు మరి ఎలాగోలా" — అంటూ మధ్య తోవలో సోమరాజుని విడిచిపెట్టి వెళ్ళిపోయేడు రాంబాబు, తననెక్కడ డబ్బు అడ్జస్టు చేయమంటాడోనని భయపడి.

మధ్యలో రాంబాబు అలా వదిలేసి వెళ్ళిపోయేటప్పటికి— అంత జనంలో నడుస్తున్న సోమరాజుకి కటిక చీకటిలో, కారడవిలోకి దారితప్పి వెళ్ళిపోయినట్టుంది. కాని అంత కటిక చీకటిలో, అంత కారడవిలోను దూరాన మిణుకు, మిణుకుమంటూ దీపం కనిపించినట్టుగా-దేవుడు తప్పక ఆదుకుంటాడనీ, అంత మొత్తం తప్పక సర్దుబాటు చేస్తాడని ఎందుకో సోమరాజు కనిపించి కొంచెం గుండె దిటవు అయింది.

### రామయ్య :

'పదిహేను వందలే!' గుడ్లు తేలేస్సాడు రామయ్య.

రామయ్య సోమరాజు తండ్రి.

రామయ్య వెదురు బొంగుకి బట్టలు తొడిగినట్టు పొడవుగా, సన్నంగా వుంటాడు. దేవుడు తనని తీసుకుపోతానంటే అందుకు సిద్ధమే అన్నట్టుగా వుంటాడు. రామయ్యది తాతగారి పేరు. తాతగారి టైములో

బోల్డు ఆస్తిపాస్తులుండేవి. ఆ వూళ్ళో రాములవారి గుడి అతని తాతగారే కట్టించారు. ప్రతి ఏటా శ్రీరామనవమి లాంటి ఉత్సవాలు బ్రహ్మాండంగా జరిపి, సంతర్పణలూ, దానాలూ చేసేవాడట. దైవభక్తి ధ్యానంలో, సేవలో అతను చేస్తున్న ఖర్చు తెల్సేది కాదట. తెలీకముందే ఆయన పోయేడట. రామయ్య తండ్రి కూడా జీవించినంతకాలం దేవుడి సన్నిధిలోనే వుండి, జీవితం ముగిసేక దేవుని దగ్గరకే వెళ్ళిపోయేడట.

రామయ్య కూడా భక్తుడే. కాని దరిద్రుడు. తాతగారిలా సేవచేయడానికి డబ్బు లేదు. తండ్రిగారిలా భగవంతుణ్ణి అంటిపెట్టుకూర్చోడానికి వీలు లేదు. తన టైమంతా ఆఫీసు కోసం, ఇంటికోసం, పిల్లల కోసం, అప్పులకోసం, అరువులకోసం పట్టీపట్టని, నిద్రకోసం తగలబడి పోతోంది. దేవుడి దగ్గర ఉదయం ఒక పావుగంట తప్పించి — మరి దేవుడు గదిలోకి వెళ్ళే తీరిక లేనివాడై పోయేడు. తను పూర్తిగా భగవంతుని ధ్యానంలో మునిగి తరించి పోవాలంటే - అది చచ్చాకే వీలవుద్ది.

తను తాతగారిలా దర్జాగా బతకలేకపోయినా, తండ్రిలా సామాన్యముగా జీవించలేకపోయినా తను అర్ధాకలితోనే బ్రతుకుతున్నాడు. అయితే అర్ధాకలితో బతకడమన్నది సామాన్య విషయం కాదు; కాదు గాబట్టే అది దేవుని మహిమే అనుకుంటాడు రామయ్య.

తను తెల్సి ఏ పాపం చేయలేదు. కాని తనకెందుకీ దారిద్ర్యం సంక్రమించింది? తమ ఇంటా వంటా లేనిది. తమ వంశంలోనే కాన రానిది తనకే ఎందుకు వచ్చింది?

ఆ ప్రశ్నలు తనకి తెలియని ప్రశ్నలు కావు. ఆ ప్రశ్నలకి జవాబులు అతని దగ్గర వున్నాయి. అతని జవాబులు ఇలా వుంటాయి.

తాత దగ్గరా, తండ్రి దగ్గరా లేని బీదరికం, దారిద్ర్యం తనకి సంక్రమించిందంటే, కుష్టి వ్యాధిలా పట్టుకు పీడిస్తుందంటే కారణం ఇంకేవిటి? నేను పూర్వ జన్మలో పాపం చేసి వుంటాను. ఎవరికో తీరని అన్యాయం చేసి వుంటాను. కనీసం ఏ తూనీగలకో దారం కట్టి ఎగరేసి, హింసించి వుంటాను. అందుకే నాకీ శిక్ష. చేసిన పాపాలనుంచి తప్పించుకు పోలేము కదా. నా తాత తండ్రులు పూర్వజన్మలో పుణ్యం చేసి

వుంటారు– అయితే వాళ్ళకి స్వర్గం. ఏ జన్మలో పాపం చేసినా పాపమే. అది అనుభవించక తప్పదు. అయితే పశ్చాత్తాపపడి ప్రవర్తిస్తే – మంచి పనివాడికి పైలా శిక్ష తగ్గించేటట్టు – పాప భారం సగం దేవుడు తప్పక తగ్గిస్తాడు. పాపాత్ముడనైనా పుణ్యాత్ముల వంశంలో పుట్టేను గాబట్టి ఆ 'ఇన్ఫ్లుయన్స్' వల్ల, ఆ ప్రభావం వల్ల నన్ను, నా కుటుంబాన్ని దేవుడు ఈ మాత్రమైనా ఆదుకుంటున్నాడనేది నూటికి నూరుపాళ్ళు నిజం. అవును నిజం.

లేకుంటే – నా పెద్ద కూతురు పెళ్ళి మూడువేల కట్నం దగ్గర ఆగిపోతే ఆ ఆపద్బాంధవుడు నన్ను ప్రావిడెంట్ ఫండు లోన్‌కి అప్లికేషన్ పెట్టమని ఐడియా ఇచ్చి, పెట్టించి, నెలరోజుల్లో ఆ డబ్బు వచ్చేసేటట్టు చేయగలిగేడు. నాకు తెలుసు – కొంత మందికి ఆరేసి నెల్లయినా లోను రాకపోవడం! అంటే ఏమిటి? దేవుడికి వాళ్ళమీద లేని దయ నా మీద వున్నట్టే గదా! నా కొడుకు జీతం కట్టలేదని కాలేజీ నుంచి తగిలేస్తే అప్పటికప్పుడు అప్పెలా దొరికింది? ఇటువంటి ఇబ్బందుల్ని ఎన్నో సార్లు ఆదుకున్నాడంటే దేవుడు నా పక్క ప్రసన్న దృక్కులు ప్రసరిస్తుండబట్టే కదా. ఇంత సంసారాన్ని, ఇంత బుల్లి జీతంతో ఈడుస్తున్నానంటే. ఎదురీదగలుగుతున్నానంటే ఏమిటి? ఆ దేవుడు. ఆ దీనసంరక్షకుడు నన్ను అనుగ్రహించబట్టే కదా. ఆ దైర్యమే లేకుంటే నా కొడుక్కి ఉద్యోగం, నా మిగిలిన ఇద్దరు కూతుళ్ళకి పెళ్ళిళ్ళు కూడా సవ్యంగా వాడి దయవల్ల జరిగిపోతాయని నమ్మకమే లేకుంటే నేనీ వయసులో నా నడుం ఎత్తగలిగి నిటారుగా, ఇలా నిబ్బరంగా నడవగలుగుతుంటానా.....

ఈ విధంగా తన దౌర్భాగ్యానికి జవాబు చెప్పుకుంటాడు. సమాధాన పడతాడు.

అందుకే రామయ్య ఈసారి కూడా–

ఆ కరుణామయుడు, ఆ దీనబాంధవుడు ఇంతవరక్కూ ఎన్నో సార్లు ఆదుకున్నట్టే ఈసారి కూడా తప్పక ఆదుకుంటాడని, పదిహేను

వందలూ తప్పక దొరుకుతాయనీ— కొడుక్కి తప్పక ఉద్యోగం అవుతుందని దృఢంగా నమ్మేడు.

దేవుడి ముందు దీపం వెలిగించి, అగర ఒత్తులు వెలిగించి రెండు చేతులెత్తి జోడించేడు. ఉద్యోగం వచ్చిన వెంటనే మొదటి జీతంతో నేనూ, నా కొడుకు నీ దర్శనం చేసుకొని తలనీలాలు సమర్పిస్తామని మొక్కుకున్నాడు. దీక్షంగా ప్రార్థిస్తూ అలా ఎంతసేపో వుండిపోయేడు.

అంతలో—

మేఘాలు ఉరిమేయి. చల్లటి గాలి రాయ్‌మని వీచింది. వీస్తూ కిటికీలో బడి దురుసుగా మూసుకు వచ్చింది. రామయ్య ఊగిపోయేడు ఆ గాలికి. దేవుడు వూగకుండా గోడలోంచి నిశ్చలంగా, నిర్మలంగా చూస్తూ నవ్వుతున్నాడు.

కాని ఆ గాలికి ఈ లోకంలో లేని రామయ్య భార్య ఫొటో దబ్బున పడిపోయింది. రామయ్య కొట్టుకున్న గుండెతో గబుక్కున వంగి ఫొటో ఎత్తేడు. దేవుని దయవల్ల ఫొటో పగల్లేదు. ప్రియమైన భార్య ఫొటోని గుండెలకి హత్తుకున్నాడు. ఫొటో అద్దాన్ని తుడిచేడు. తుడుస్తూ తదేకంగా చూశేడు.

అంతే!

చీకట్లో చటక్‌మని మెరుపు.

రామయ్య మస్తిష్కంలో కూడా మెరుపు.

ఆ వెంటనే రామయ్య ముఖంలో దరహాసం! గుండెల్లో వేయి గుడిగంటల శ్రావ్యగానం! ఆ ఫొటోలో ఆమె మెడలో గుత్తులు, గుత్తులుగా మెరిసిపోతూ కాసుల పేరుంది.

చావు మనిషికుంది గాని— భాగ్యానికి, కీర్తికీ, బంగారానికీ, చావు లేదుగా!

ఆ బంగారపు నగ బతికే వుంది. భద్రంగా వుంది.

అయితే రామయ్య దగ్గర కాదు—

వడ్డీల వరహాల్రాజు దగ్గర.

ఆ ఆరు తులాల కాసుల పేరు కేవలం నాలుగొందలకి తాకట్టులో వుంది. వడ్డీ ఇప్పటికి ఆరు వందలు మాత్రమే అయివుంటుంది।

శ్రీనామల వ్రతం ఎలా చేయాలని - తన దగ్గర పైసా కూడా లేని బీద బ్రాహ్మడు వెర్రి చూపులు చూస్తూ బాధపడుతుంటే-ఆ శ్రీమూర్తులే, పూజ చేయమన్న శ్రీమూర్తులే రెల్లు పొద కింద మూడు పైసలు చూపించి నప్పుడు - ఆ బ్రాహ్మడు పొందిన ఆనందాన్నే సరిగ్గా రామయ్య కూడా పొందగల్గేడు।

రామయ్య నిలువల్లా ఒణుకుతూ, అమిత భక్తితో, ఆవేశముతో సాష్టాంగ దండ ప్రణామములు ఆచరించి గబగబా వున్నపాటున ఇంటి నుండి బయల్దేరాడు.

చీకటి పడుతుండగా బయల్దేరుతున్న తండ్రిని సోమరాజు 'ఎక్క-డికి' అని అడుగుదామనుకున్నాడు. కాని ఎక్క-డికైనా బయల్దేరు తున్నప్పుడు 'ఎక్క-డికి' అనడగడం అశుభం గాబట్టి అడగలేదు. అయితే తండ్రి డబ్బుతో తిరిగి వస్తాడని, అలా వచ్చేటట్లు భగవంతుడు ఖచ్చితంగా చేస్తాడని -ఖచ్చితమైన అభిప్రాయం సోమరాజు హృదయంలో ఏర్పడి పోయింది.

కాని గుండెలు మటుకూ రోజుకన్నా హెచ్చు స్థాయిలోనే కొట్టుకో సాగేయి।

*          *          *

పరహో్రరాజు :

పరహో్రరాజు వృత్తి వడ్డీ వ్యాపారం అనడానికి వీల్లేదు. ఏమంటే అతను రామయ్యలాగే గుమాస్తా ఉద్యోగి. కంపెనీలో కార్మికుల కోసం, చుట్టూ వున్న ప్రజల కోసం - ఆపద సమయంలో ఆదుకోడానికి వారికి 'డబ్బు సహాయం' చేయడం అనేది ఒక బాధ్యతగా పెట్టుకున్నాడు. కాని కిట్టని వాళ్ళంతా తనని వడ్డీ వ్యాపారస్తుడని అంటారు. అందుకు తను బాధ పడడు. తన నీతి, నిజాయితీ, ధర్మం తన దగ్గరున్నప్పుడు వెధవల మాటలు ఎందుకు లెక్క-లోకి తీసుకోవాలంటాడు.

అంచేత తనని వడ్డీల వరహాల్రాజుగా చాటున అనుకుంటారని విని కూడా బాధ పడలేదు. పైపెచ్చు గర్వపడతాడు. ఏమంటే ఏడుకొండల వాడికే వడ్డీకాసుల వాడని పేరుంది కదా!

వరహాల్రాజుకి యుక్త వయసులోనే భార్య చనిపోగా—ఆమె తప్పించి మరో సంతానం లేని మావఁగారి సొమ్ము తనకి బాగా కలిసొచ్చింది. అంత డబ్బునీ ఏం చేయాలో తోచక ఏడుకొండలవాడి పటం ముందు పెట్టేశాడు.

'ఈ డబ్బు ఏం చేయమంటావు స్వామీ! నీకు పాలరాతి మందిరం కట్టించమంటావా? లేక "వెంకటేశ్వర నిలయం" అనే పేరుతో పెద్ద భవనం కట్టించమంటావా? లేక బేంకులో నీ నామధేయుడైన నా కొడుకు పేర వ్రాయమంటావా? ఏం చేయమంటావు తండ్రీ?' అని అడిగితే—

అవన్నీ అంత ముఖ్యం కావనీ, అవన్నీ తర్వాత చూసుకో వచ్చునీ, ముందుగా ప్రజలను ఆదుకొని మానవసేవ చేయమని – మానవ సేవే మాధవ సేవని—పటంలోంచి తేజస్సులా వచ్చి తనకి జ్ఞానోపదేశం చేసి కళ్ళు తెరిపించేడు దేవుడు.

దైవాజ్ఞని మహాప్రసాదంగా అంగీకరించేడు తను.

కాని ఇక్కడొక పెద్ద సమస్య వచ్చి పడింది!

దేవుడు ప్రజల అవసరాలకి ఆదుకోమన్నాడు బాగానే వుంది. కాని ఆచరణలో అదెలా సాధ్యం? ఇంత ప్రజలో ఎవరికి ఎంత అవసరమో తనకెలా తెలుస్తుంది? తను దేవుడు కాదే తెలియడానికి! పోనీ 'మీ అవసరాలకి నా దగ్గరకొచ్చి డబ్బు తీసుకోండోచ్' అని దండోరా వేయించామనుకోండి. డబ్బంటే ఎవరికి చేదు. నా కవసరమంటే నా కవసరమని బెల్లంమీద ఈగల్లా-పడిపోయి డబ్బంతా దోపిడీ చేసేస్తారు. ఆ విధంగా డబ్బు సద్వినియోగం చేయకుండా దుర్వినియోగం చేసినందుకు దేవుడు తనని మన్నించదు కాక మన్నించడు.

ఏం చేయడంరా దేవుడా అని చేతుల్లోకి తలదూర్చి తలపోస్తున్న వరహాల్రాజుకి కత్తిలాంటి ఆలోచన వచ్చింది-అదే వడ్డీ!

వడ్డీ అసల్లో పెడితే - అప్పుడు వచ్చినట్టు అవసరం వున్నవాడే వస్తాడు గాని అనవసరపువాడు రాడు.

అయితే ఆ విధంగా సహాయం వడ్డీ సాయంతో అమలు పరుద్దామనుకుంటే-ఇక్కడ కూడా కొన్ని విపత్కర పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది.

వందకి రూపాయి, రెండూ వడ్డీ అంటే కూడా ప్రజలు తెగ వచ్చి పోతున్నారు. అంతమందికి ఇచ్చేటంత సొమ్ము తనకెక్కడిది? తనేం కోటీశ్వరుడు కాదుగా? అంచేత అవసరం వున్నవారిలో అత్యంత అవసరమున్న వాళ్ళనే ఆదుకోవటం న్యాయం. అంత అవసరం వున్నవాడు ఎంత వడ్డీకైనా వస్తాడు-గనుక వందకి వడ్డీ అయిదు రూపాయల నుంచీ పదీ, పన్నెండు వరకూ పెంచాల్సిన పరిస్థితులు ఏర్పడక తప్పలేదు. అంతే గాకుండా డబ్బు సాయదారిది గాబట్టి పుచ్చుకున్నవాడు విశ్వాసం లేకుండా- 'నీవు నాకు ఇవ్వలేదు' అని బూకరించేయకుండా బంగారం, స్థిరాస్తు లాంటివి తాకట్టు పెట్టుకొనో, ప్రోనోట్ల ద్వారానో డబ్బు 'సహాయం' ప్రజలకి చేస్తూ ఆదుకుంటున్నాడు. ఆ విధంగా దైవాజ్ఞ అమల్లో పెట్టి తన జీవితమంతా ప్రజాసేవకీ, తద్వారా దైవసేవకీ అంకితం చేసేశాడు.

అలా ఎన్నో సంవత్సరాలుగా, ఎంతో మందిగా వరహాల్రాజుచే ఆదుకోబడుతున్న వారిలో మన రామయ్య ఒకడు.

రామయ్యను చూడగానే వరహాల్రాజు గుండె గతుక్కుమంది.

ఏమంటే, రామయ్య నగ వరహాల్రాజు దగ్గరలేదు. నాగదేవి మెళ్ళో వుంది. ఆ నాగదేవి ఇక్కడ లేదు. ఎక్కడుందో తనకి తెలీదు.

నాగదేవి వరహాల్రాజుకన్నా ఇరవయ్యేళ్ళు చిన్నది. పాతికేళ్ళ పరువపు ప్రాయపుది. ఎత్తు గుండెలది. ఎత్తు పిరుదులది. కలువ కన్నులది. వన్నెల చిన్నది. వయ్యారి నడుంది. కాని నల్లది. అయితేనేం సెక్సీది. వరహాల్రాజు అందుకే ఆమెను వుంచుకున్నది. అయితే-

వరహాల్రాజు వుంచుకోలేదంటాడు. నాగదేవిలో ఏడుకొండలవాణ్ణి చూసి ఆరాధించేను, ప్రేమించేను-అంటాడు. అంచేతనే ఆమె ఏది అడిగినా కాదనకుండా వెంకటేశ్వర్లు అడుగుతున్నట్టుగానే భావించి ఇచ్చేసేవాడు

ఆమె తన ఆరాధ్య దైవం అనుకోడం వల్ల ఆమె మెళ్ళో రామయ్య నగ స్వయంగా తగిలించి తనివిదీరా కౌగలించుకొని తన్మయత్వం చెందేడు.

అలా తన్మయత్వపు తిమురులో వరహాల్రాజు వుండగా, వుంటుండగా-నాగదేవి నెమ్మదిగా జారుకొని, సర్దుకొని, వరహాల్రాజుని వదిలేసి. ఏ వజ్రాల రాజుతోనో, వైఢూర్యాల రాజుతోనో చప్పున లేచిపోయింది. వరహాల్రాజుకి అది చాలా పెద్ద షాక్ అయింది. దాన్నుంచి తేరుకోడానికి చాలా టైము పట్టింది.

ఆ ముండ అంత మాయామోసం చేసినందుకు తొలిసారిగా దేవుణ్ని నిందించేడు. తర్వాత క్రమేణ నాగదేవి లేనిలోటుని శోభాదేవి, గీతారాణి, మంగ, రీటా....వగైరాలూ తీర్చడంతో - ఆ మాయ ముండమీద బాధ, బెంగ పోయేయి. దేవుణ్ణి అజ్ఞానంతో నిందించినందుకు దేవుడి ముందు గట్టిగా లెంపలు వేసుకున్నాడు. ఎక్కణ్ణించో లేచిపోయి తన దగ్గరికి వచ్చిన ముండ, మరెక్కడికో లేచిపోయి, రాలిపోక....ఒక చోట గుమ్మటంలా ఎందుకుంటుందీ ? అనుభవిస్తుంది. అనుభవిస్తుంది. కుష్ఠిరోగం వచ్చి కుళ్ళి కుళ్ళి చస్తుంది.' అని సమాధానపడ్డాడు. అది బంగారం ఎత్తుకు పోయిందనే బాధమాత్రం కొంత కాలంగా వుండిపోయింది. ఏమైనా తనకిది గుణపాఠం. ఆ రోజునుంచి ఏ ఆడదానిలోనూ ఏడుకొండలవాణ్ణి చూడ్డం మానుకున్నాడు. ఎవర్నీ వుంచుకోకుండా.... తన 'అవసరం' మాత్రమే తీర్చుకొని ఆ అవసరానికి సరిపడా పారితోషికం మాత్రమే చెల్లిస్తూ చేతులు దులుపుకోడం అలవర్చుకున్నాడు. మరి కొన్నాళ్ళకి వస్తూన్న అధిక లాభాల్లో ఆ ముండ మోసుకుపోయిన బంగారం నలుసులా కన్పించడంతో మర్చిపోయేడు కూడా.

కాని రామయ్య రావడంతో....ఆ నగకోసం వచ్చాడేమోనని భయపడిపోయేడు. ఇక ఏదారి తోచక....దేవుడి పటం దగ్గరికి వెళ్ళేటంత టైము కూడా లేకపోడంతో....అక్కడికక్కడే దేవుడికి మనసులోనే మొక్కేశాడు వరహాల్రాజు,

ఏమని ?

ఈ నగ వ్యవహారంలో నన్ను గట్టెక్కిస్తే....నీ కొండెక్కి

కాను. నీ దర్శనం చేసుకుంటానన్నాడు. (అందులోనూ నీ దర్శనం చేసుకొని ఏడాదైపోవస్తోంది కూడానూ!

దాంతో దడదడలాడిన గుండె కాస్త దిటవై—'ఏం, రామయ్యా, ఇలా దారితప్పివచ్చేవని' శ్రావ్యంగా పలకరించేడు.

'దారితప్పిరాలేదు. సమయానికి ఆ భగవంతుడే దారి చూపించి వరహాల్రాజు వద్దకి పొమ్మన్నాడ'ని విషయం చెప్పేడు. అవసరం చెప్పేడు.

హమ్మయ్య అనుకున్నాడు వరహాల్రాజు

వెధవది తనేదో భయపడ్డాడుగాని! ఈ దరిద్రపు వెధవలు అప్పు చెయ్యడానికిగాకపోతే ఏటి? అప్పుతీర్చడానికొస్తారా? నగ అక్కర్లేదట గాని ఇంకా ఆ నగపై పదిహేను వందలు కావాలట, ఇవ్వొచ్చు. దాని ఖరీదు ప్రస్తుత రేటులో మూడు వేలు పైనే వుంటుంది. రామయ్య నిజంగానే విడిపించడానికొచ్చి పేచీ పెడితే—కాళ్ళావేళ్ళా బ్రతిమలాడి నగ ఖరీదు మూడు వేలు ఇచ్చేద్దామనుకున్నాడు. కాని అందుకొస్తేగా! అప్పు కావాలట అప్పు!—

'ఏటి రామయ్యగారూ! మీరింత పని చేస్తారనుకోలేదు. మిమ్మల్ని చూడగానే—డబ్బు తెచ్చారనుకున్నాను.... డబ్బు తేలేదు. పోనీ వడ్డీయైన కట్టడంలేదు.... పైగా ఆ నగ మీదే అప్పుకోసం వచ్చేరు-ఏం న్యాయం చెప్పండి' అన్నాడు,

'అవునౌను వరహాల్రాజుగారూ, న్యాయంకాదు' అని ఒప్పేసుకున్నాడు రామయ్య. 'కాని....మీరే రక్షించాలి' అని చేతులు పట్టేసుకున్నాడు. నా కొడుక్కి ఉద్యోగం వస్తే ఆ పుణ్యం నీదే అన్నాడు. చేతులు మాత్రం వదల్లేదు.

పుణ్యం వస్తుందంటే తనేం పొంగిపోలేదు. చేతులు పట్టుకుంటే కరిగిపోలేదు. కాని ఎందుకొచ్చిన గొడవ - ఆ లేని వస్తువుతో సంబంధం పెట్టుకోకూడదని, అది ఎప్పటికయినా డేంజరే' అని నిశ్చయానికొచ్చి- ఆ వస్తువు పూర్తిగా అమ్మేస్తే, దానిమీద పాత బాకీ అసలూ, వడ్డీ కొట్టేసి

వెయ్యిరూపాయలు ఇస్తానన్నాడు. అంతకుమించి ఒక్క పైసా ఎక్కువ ఇవ్వలేనన్నాడు వరహాల్రాజు.

కాని అవసరం పదిహేను వందలని రామయ్య చేతులు కాళ్ళ అనుకోమనే పద్ధతి వదిలేసి ఏకంగా కాళ్ళమీదే పడిపోయాడు. మరిక కాళ్ళు వదల్లేదు.

వరహాల్రాజు కనికరపడిపోయి 'గొప్ప ఇరకాటంలో పడేస్తావయ్యా. ఏడుకొండలవాడా' అని నిట్టూర్చి-మిగతా అయిదు వందలకి ప్రోనోటు రాయించుకొని-అసలు నేను రాత్రులు ఇంతవరకూ మాలచ్చి తల్లిని బైటకి పంపలేదు. అయినా నీ అవసరం కన్నా నా నియమాలు ఎక్కువ కావ'ని అంటూ పదిహేను వందలిచ్చి బందీనుంచి తన కాళ్ళను విడిపించుకున్నాడు వరహాల్రాజు।

రామయ్య వెళ్ళిపోగానే.... గబగబా దేవుడి గదిలోకెళ్ళి పడిపోయేడు ? పటాన్ని తాకి దండంమీద దండం ఇరవైసార్లు పెట్టేడు. 'ఆపద్బాంధవా ! నాకొచ్చే ఆపద తీర్చవయ్యా అంటే, ఆపద తీర్చటమే గాక లాభం చూపించేవు. ఆహా ! నిజంగా నీవెంత దయామయుడవయ్యా ! నీ దర్శనం త్వరలో....అతి త్వరలో తప్పక చేసుకుంటాను తండ్రీ !'- వరహాల్రాజు ఒడలు భక్త్యావేశంతో జలజల జలదరించి కళ్ళు చెమర్చేశాయి.

అదే సమయంలో—

రామయ్య వళ్ళు కూడా భక్త్యావేశంతో జలదరించి, కళ్ళు చెమర్చేయి.

ఏ విధంగా నైతేనేం, ముందుకి తన కొంప కూలిపోబోతేనేం, మున్ముందుకి ఎన్ని రాబందులు తనని పీక్కు తినబోతేనేం, ఎల్లుట పెను తుపాను వస్తేనేం, రేపు వడగాలి వీస్తేనేం, మరుక్షణంలో తను లావాలో పడి కొట్టుకుపోయి వస్తేనేం— ఈ క్షణంలో, అతి తక్కువ టైములో అనుకున్నట్టుగా రాత్రికి రాత్రి—కొడుకు ఉద్యోగం కోసం పదిహేను వందలూ....ఒక్కటికాదు....ప.ది.హే.ను.వం.ద.లు—దొరికేయి.

శ్రీరామచంద్రా....ఓసిమ్మాద్రి అప్పన్నా....ఓ తండ్రీ ఏమ

కొండలరావా — నన్ను ఎప్పటికప్పుడు ఆదుకుంటున్న మీ ఋణం ఎలా తీర్చుకోగలనయ్యా!

* * *

రవీంద్రబాబు :

అదో చక్కని సంగీతంలా గంటలు మ్రోగేయి.

రవీంద్రబాబు వెళ్ళి తలుపులు తెరిచేడు.

ఎదురుగా బ్రోకర్ అప్పన్న!

అబ్బ! సమయానికొచ్చేడు — అనుకున్నాడు రవీంద్రబాబు.

రవీంద్రబాబు ఆ కంపెనీకి పర్సనల్ ఆఫీసర్. అతనికి పెళ్లాం ఒక్కత్తేగాని ముండలు ఎక్కువ. పిల్లలు ఇద్దరేగాని వాళ్ళపై ప్రేమ ఎక్కువ. అతని బుర్ర పెద్దదేగాని బుర్రమీద వెంట్రుకలు తక్కువ. అతని కొస్తున్న రాబడిమీద జీతం తక్కువ. పేకాటంటే పెళ్ళాంకన్నా మక్కువ. వారానికి తాగని రోజులు తక్కువ. మనిషి పొడవు తక్కువ. లావు ఎక్కువ. వయసు నలభైకి ఏడాది తక్కువ. అతనికి దైవభక్తి మాత్రం చాలా చాలా ఎక్కువ.

చాలా మందికి ఆపద సమయాల్లోనే దేవుడు గుర్తుకొస్తాడు. కాని రవీంద్రబాబుకి దేవుడెప్పుడూ గుర్తుంటాడు. నిద్రనుంచి లేవగానే దేవుణ్ణి తలుచుకుంటాడు. కళ్లు తెరవగానే గోడలోంచి నవ్వుతున్న దేవుణ్ణి చూస్తాడు. స్నానం చేసేక పావుగంట ప్రార్థన ఎట్టి పనులున్నా మానడు. ఏదైన తినేముందు, ఏమైనా చేసేముందు దేవుణ్ణి తలచుట మానడు, మానడు. అప్పుడు, ఇప్పుడు అననేల సర్వకాల సర్వావస్థలయందునూ దేవుణ్ణి తలచకుండా వుండలేడు.

రవీంద్రబాబు కెపుడూ దేవుడు ద్రోహం చేయలేదు.

తను చాలా మొదట్లో ఒక యువతికి ఉద్యోగం వేయిస్తానని మాయచేసి... చివరికి ఆమెకు ఉద్యోగం బదులు కడుపు రాగా, నలుగురిలోకి రాలేక, జరిగిన మోసం చెప్పలేక గదిలో సీలింగ్ ఫేన్‌కు చీర బిగించి వురేసుకు చస్తే — జైలుకాదు, కనీసం ఆ కేసులో తన పేరు కూడా రాకుండా రక్షించేడు భగవంతుడు.

మొదట్లో లంచాలు తీసుకోవడం కొత్తవల్ల, అనుభవం బొత్తిగా లేకపోవడంవల్ల అవినీతి నిరోధకశాఖ వారికి దొరికిపోయినప్పటికీ - ఒకటీ రెణ్ణెల్లు అలా, ఇలా తిప్పితిప్పి - అసిస్టెంటు పర్సనల్ ఆఫీసరు గిరినుంచి పర్సనల్ ఆఫీసరుగా ఆ కంపెనీనుంచి ఈ కంపెనీకి పో, పొమ్మన్నారు!

అది లగాయతూ తను నిర్భయంగా లంచాలు గుంజగల్గుతున్నాడు. నిస్సంకోచంగా ఆడపిల్లల జీవితాలతో ఆటలాడగల్గుతున్నాడు. ఎన్ని చేసినా, అన్నివేళలా ఆ భగవంతుడు ఆపదకి అడ్డుపడుతూనే వున్నాడు.

భగవంతుడు తనకి అండగా వున్నాడనే ధైర్యమే తనని ఇంకా ఎన్నో ఘనకార్యాలకి ముందుకు తోస్తోంది. కార్మికులని తక్కువ జీతాలతో, ఎటువంటి సదుపాయాలు, సౌకర్యాలు లేకుండాచేసి అణగద్రొక్కుతూ, యూనియన్ లీడరు జేబులో నోట్లుదూర్చి వాళ్ళని బానిసలుగా, పీనుగులగా చేయగల్గుతున్నాడంటే - అది తన ఒక్కడిపనా? కాదు, ఆ దేవుని సంపూర్ణ సహకారం.

రవీంద్రబాబు తను చేస్తున్న పనులు గొప్పవని ఎదుటివాళ్ళతో గానీ, తన అంతరాత్మతోగాని సమర్థించుకోడానికి ప్రయత్నించడు. దేవుడు గొప్పవాళ్ళ పార్టీయేగాని పేదల పార్టీకాదని అతనికి ఖచ్చితంగా తెలుసు.

అతనికి ఏమాత్రం పాపభీతి లేదు. ఏమంటే తను దైవభక్తుడు. భక్తుడికి దేవుడు అన్యాయం చేస్తాడా ఎక్కడైనా? రావణాసురుడు మునుల్ని హింసపెట్టి, మునికన్యల శీలాలతో చెలగాటాలు ఆడి, ఆడింపించి, చివరికి రాముడి పెళ్ళాన్నే చెరబెట్టి, రాముడిపై తిరగబడి కూడా మోక్షం సంపాదించేడంటే ఏమిటి? గొప్ప దైవభక్తుడు గాబట్టి.

అలాగే నేనూ భక్తుణ్ణి. నా భక్తికి నా పాపాలు సర్వం కొట్టుకు పోతాయి. అసలు నాలో భక్తి లోపించివుంటే, దేవుడిపట్ల అపచారం చేసివుంటే —— ఇంతటివాణ్ణి అవుతానా? — అంటాడు రవీంద్రబాబు.

అవును, రవీంద్రబాబు అంతటి గొప్పవాడే! అయితే ఎంతటి గొప్పవాళ్ళకైనా ఒకొక్కప్పుడు చేతిలో పైసాకూడా లేనంత గొప్ప ఇబ్బంది కలగక మానదు.

నాలుగు బేంకుల్లో డబ్బు మూల్గుతున్నా, ప్రస్తుతం రాత్రి పది గంటల ప్రాంతంలో పేకాట కెళ్ళడానికి డబ్బులేక కాలుకాలిన పిల్లిలా అటూ, ఇటూ తిరుగుతున్నాడు. పొరపాటున ఉదయం డబ్బు డ్రా చేయడం మర్చిపోయేడు.

ఇప్పుడు తనకి డబ్బుకావాలి.

ఎలాగ?

"భగవాన్ ! నన్ను అన్నివేళలా, అన్నివిధాలా ఆదుకుంటున్న నీవు ఆఖరాఖ ఈ చిన్న విషయంలో ఈ రాత్రి నాకు ఆనందం దక్కనీయకుండా ఏడిపించడం న్యాయమా తండ్రీ" అని రిచ్ డాడీ ఎదట స్వీట్ బేబీ మారాం చేసినట్టుచేసి — "సరే నాకీ సమయంలో నా కెంత డబ్బు దొరికితే అంత డబ్బులో నీకు టెన్ పెర్సెంట్ ఇస్తాను, నీ హుండీలో వేస్తాను" అని దేవుడికి లంచం ఆశపెట్టేక లంచగొండి రవీంద్రుడికి కొంత ధైర్యం కల్గినట్టయింది.

డబ్బుకోసం కొందరు మిత్రుల యిళ్ళకి రింగ్ చేద్దామనుకుంటుండగా.... టంగ్ టంగ్మని గంటలు ద్వారం దగ్గర మ్రోగేయి.

అతనికి దేవుడి గుళ్ళో గంటలు గుర్తుకొచ్చి 'జయం' అనుకున్నాడు.

తలుపు గబగబా తీస్తే ఇంకేముంది?

అప్పన్న రూపంలో దేవుడు !

మరో అయిదు నిమిషాల్లో రవీంద్రబాబు కారు నైట్క్లబ్ వైపు వడ్రున పరిగెట్టింది.

* * *

సోమరాజు, అతని తండ్రి రామయ్య తిరుపతి వెళ్ళి నున్నగా గుళ్ళుకొట్టించుకు వచ్చేశారు ।

దేవుని మేలు మర్చిపోకుండా — వాళ్ళిద్దరేకాదు—జగన్నాథం, అప్పన్న, వరహాల్రాజు, రవీంద్రబాబు తమ తమ మొక్కుల్ని వెంటనే వెన్వెంటనే తీర్చేశారు ।

అందర్నీ అలా ఆదుకుంటున్న ఆ దేవుడు — అవునవును. దయామయుడే కదా మరి ।